# భార్యాభర్తలు

ఆరోజూ సరళకు తొమ్మిదిన్నరకు తెల్లవారింది. హృదయము శ్మశానవాటికలా వుంది. కళ్ళు తేలిపోతున్నాయ్. శరీరం వున్నట్లేలేదు. మంచంలోనే కూర్చుని అటూ ఇటూ చూచింది. కిటికీలోనుంచి పూలదిమ్మ కనిపిస్తూవుంది. గాలికి పువ్వులు స్త్రీముంగురులు చెదరిపోయినట్లు చెదరిపోతున్నయ్. సరళ హృదయంలో ఆవేదన పుట్టింది ఆవేదనకు కారణం తెలిసినట్లే వుండి తెలియటం లేదు.

ఏమిటది?

సరళ తన అయోమయాన్ని భరించలేకపోయింది. కళ్ళు మూసుకొని ఆలోచించింది. కెరటాల్లాగా వొకసంగతి, తర్వాత మరోసంగతి, తర్వాత మరోసంగతి జ్ఞాపకం వచ్చింది. రాత్రి తాను మూడుగంటలవరకూ నిద్రపోలేదు రాత్రంతా ఏడుస్తూనేవుంది. ఎందుకు? నిన్న మధ్యాహ్నం వచ్చిన వుత్తరం జ్ఞాపకం వచ్చింది. ఆ ఉత్తరం ఆ!....ఆ!!

గబుక్కున మంచం మీదనుంచి లేచింది. గబగబా డ్రాయరుదగ్గరకు వెళ్ళింది. దాని మీదవున్న వుత్తరాన్ని చటుక్కున తీసుకుంది. ముక్కలు ముక్కలుగా చించివేసింది. నెమ్మదిగావచ్చి మంచంమీద కూర్చుంది. ఏడవాలనిపించింది. ప్రయత్నించింది. ఏడుపు రాలా! ముంజేతిని చెంపకు ఆన్చి ఆలోచించింది. కిటికీలోంచి బరువుగా, వొయ్యారంగా కదిలే పూలరెమ్మని చూస్తూ ఆలోచించింది. జరిగిపోయిన తన నాలుగు సంవత్సరాల జీవితం లేచిన అలలగా వొక్కసారి కనిపించింది.

* * *

మొదట్లో ఆమె ప్రసాద్‌ని వొక మీటింగులో చూచింది. అతని వుపన్యాసం ఆమెను ఆకర్షించింది. ఉపన్యాసం అంటే అచ్చగా ఉపన్యాసం

కాదు. అతని వాక్చాతుర్యం, ఆత్మవిశ్వాసం. తళుకుతళుకున మెరిసే నేత్రాలూ, విశాల వక్షం—ఆమెను ఆకర్షించాయి. ఇంకేం! ఉపన్యాసకుణ్ణి ప్రేమించింది. మొదట్లో అతడు అంగీకరించలేదు. తర్వాత నమ్మలేదు.

"నేను బీదవాణ్ణి...." అన్నాడు.

"నాకు మన ఇద్దరికీ అక్కర్లేనంత ధనంవుంది." అని ఆమె జవాబు చెప్పింది.

అతడు అంగీకరించాడు.

వివాహం వైభవంగా జరిగింది. ప్రసాద్ స్నేహితులు కొందరు వచ్చి, ఆశీర్వదించి పోయారు. వాళ్ళు బందిపోటు దొంగల్లాగా కనిపించారు సరళకు. ఆమెకు కష్టం వేసింది.

వివాహం జరిగిం తర్వాత రెండు సంవత్సరాలు మధురంగా, సుఖ స్వప్నంగా, గడిచిపోయినై. ప్రసాద్ ఆమెను విడిచి ఒక్కక్షణంకూడా వుండేవాడుకాదు. జీవితంలో ఆమెకు చీరా, జాకెట్టూ ఎంత అవసరమో ప్రసాద్ అంత అవసరంగా కనిపించేవాడు. అతనుకూడా అలాగే ప్రవర్తించాడు.

మధ్య మధ్య అతనికి ఎక్కడనుంచో వుత్తరాలు వస్తుండేవి. అతడు చదివి చీకాకు పడేవాడు.

"ఏమిటండీ?" అని సరళ ప్రశ్న.

"బయటి ప్రపంచం." అంతే జవాబు.

కాని, రోజులు గడిచినకొద్దీ ఆ వుత్తరాలు చదవటం మానేశాడు. ఇక అవుత్తరాలు రావటం మానుకున్నయ్.

ఈ విధంగా మూడు సంవత్సరాలు వొక వెన్నెల రాత్రిలా వొక ప్రేమ గీతంలా, వొక వనవిహారంలా గడిచిపోయినై!

తరువాత పరిస్థితులు మారిపోయినయ్!

ఒకరోజు ప్రసాద్ చాలా చీకటిపడి ఇంటికొచ్చాడు. సరళ అడిగింది. "ఎక్కడికి వెళ్ళారు?" "బయటి ప్రపంచం" అని జవాబు చెప్పి, గదిలోకి వెళ్ళి గడియవేసుకొని పడుకున్నాడు. అప్పటినుంచీ ఎక్కడికో వెళ్తుండేవాడు ఎప్పుడో వస్తుండేవాడు. క్రమేణా అతని స్నేహితులు ఇంటికి రావటం సాగించారు. సరళ లేనట్లే ప్రవర్తించేవారు. మాట్లాడుకొనేవారు. పోట్లాడుకునేవారు. ఎక్కడపడితే అక్కడ తుపుకు తుపుకున ఉమ్మేసేవారు. బురదకాళ్ళతో సిరేరిబరీలు తిరిగినట్లు తిరిగేవారు. ఇల్లంతా సారాయి దుకాణం చేశారు.

సరళ ప్రసాద్‌కి చెప్పింది....

"ఇదేమీ బాగాలేదు."

"ఏది?"

"నీ స్నేహితులు."

"వారు బాగుంటారని నేనెప్పుడు జెప్పాను?"

"ప్రవర్తన"

"తిండిలేనివాళ్ళ ప్రవర్తన అంతకంటే ఏం బాగుంటుంది!"

అంతే! తెల్లవారిలేచి చూచేటప్పటికి ప్రసాద్ ఇంట్లోలేడు. ఎక్కడ వెదికినా కనిపించలేదు.

నెలరోజులు గడిచిం తర్వాత కలకత్తా నుంచి సరళకు అకస్మాత్తుగా ఈ పుత్తరం వచ్చింది.

"నేను వివాహం చేసుకున్నాను.

నీ సంగతి నీ యిష్టం...."

—ప్రసాద్

* * *

ఇవన్నీ జ్ఞాపకం చేసుకొని సరళ కోపంతో, ఈర్ష్యతో వొణికిపోయింది. మంచంమీదనుంచి లేచింది. దాసీని పిలిపించింది. పెట్టెబేడా సర్దమంది. డబ్బుతీసుకుంది. కలకత్తా ప్రయాణం కట్టింది.

రైల్లో ఆమెకు చాలా అనుభవాలు కలిగినయి. ఆ అనుభవాలతో ఆమె కలవరపడింది. అంత మంది జనాన్ని చూచేటప్పటికి తన వొంటరితనం భయంకరంగా కనిపించింది. కిటికీలోంచి బయటకు చూచి, నలకపడ్డట్టు నటించి కన్నీరు తుడుచుకుంది.

అయిదు సంవత్సరాల పిల్లవాడు ఆమె చెంగు పట్టుకొని లాగాడు. ఆమె చలించింది. ఆ పిల్లవాడు బోసినవ్వు నవ్వాడు. ఆమె మాతృహృదయం ఆక్రోశించింది. ఆనందంతో ఆమె శరీరం ఉప్పొంగింది. బుజ్జగించబోయింది....చేతటాలేదు. పలకరించబోయింది....చేతగాలేదు. ఎత్తుకోబోయింది....చేతగాలేదు. పైగా పిల్లవాడు ఏడ్చాడు. తల్లి దగ్గరకు తీసి వోదార్చింది. క్షణంలో తల్లి వొళ్ళో కూర్చొని కిలకిలా నవ్వుతున్నాడు.

సరళకు కంపరం పుట్టింది. తనమీద తనకే కోపం వచ్చింది. అసహ్యం కలిగింది. దాంతో ప్రసాద్ కావాలనే కోర్కె, ఆశా, తృష్ణ ఎక్కువయినై. "ప్రసాద్ నావాడు; మధ్య ఇదెవ్వతె?" అనుకుంది.

రైలు వికటధ్వని చేసింది.

* * *

కలకత్తాలో దిగి కారువాడికి ప్రసాద్ ఎడ్రస్ ఇచ్చి పోనివ్వమంది వాడు అనేక బజార్లు తిప్పితిప్పి ఒక యింటి దగ్గరకు చేర్చాడు. ఆ ఇల్లు తాళంవేసి వుంది. ఆ యింటి యజమాన్ని పిలిపించి సరళ ప్రసాద్‌ను గురించి అడిగింది. అతడు "ప్రసాద్ నిన్నే ఇల్లు ఖాళీచేశాడనీ దగ్గర్లో ఒక చిన్న గ్రామంలో వుంటున్నాడనీ" చెప్పాడు. ఎడ్రస్ తీసుకొని సరళ ఆ గ్రామం బయలుదేరింది.

* * *

అది కూలీలపల్లె. పక్కనున్న యంత్రశాలలో పగలల్లా దారిపేసి పొట్టపోసుకుంటూ వుంటారు కూలీలు. సరళ తిరిగి తిరిగి ఆ వూరు చేరుకుంది. దారేపోయే వొక ముసలివాణ్ణి పిలిచి :

"వారెక్కడుంటున్నారు?" అని ప్రశ్నించింది.

"ఎవరూ!" ముసలివాడాశ్చర్యంగా అడిగాడు.

పేరు చెప్పటానికి సిగ్గువేసింది. కాని ఏం చేస్తుంది!

"ప్రసాద్‌గారు"

"ప్రసాద్‌గారా? ఏ ప్రసాద్‌గారు!" అతడు ఆలోచిస్తూ అడిగాడు.

సరళ ప్రసాద్ వర్ణించి చెప్పింది. ముసలవాని నేత్రాలు ఆనందంతో నిండినై.

"ఓ! బాబూగారా? తెలియకేం?... రండి...." అని దారి తీశాడు.

"మీ రెవరమ్మా?"

సరళకు ఏమీ తోచలేదు. కొంచెంసేపు నసికి "స్నేహితురాల్ని" అని చెప్పింది.

"ఆయన చాల మంచివాడు. మేమందరం ఆయన్ని తండ్రిలాగా చూసుకుంటాం." అని ముసలివాడు ఏమేమో చెపుతున్నాడు. ఆమెకు ఇవన్నీ పట్టలేదు. "ఆయన భార్యకూడా ఇక్కడే వుందా" అని అడిగింది.

"ఎవ్వరూ?....అమ్మగారా!—ఇక్కడే ఉన్నారు. ఇద్దరు కలిసే పనిచేస్తున్నారు—బహు చక్కని దాంపత్యం" సరళ హృదయం దడదడ కొట్టుకుంది. ముసలివాడు ఒక గుడిసెముందు ఆగాడు.

"ఇదే!" అని ముందున్న గుడిసె చూపించాడు.

"ఏది?" ఆశ్చర్యంగా అడిగింది సరళ.

"ఇదేనమ్మా....రండి" అని గుడిసెలోనికి తీసుకొని వెళ్ళాడు.

ఆమె ఒక్క క్షణం ఆలోగిలి పరిశీలించి చూచింది. ఆ గుడిసె తడికెతో రెండుగా భాగించబడింది. ఒకభాగంలో వంట, రెండో భాగంలో రెండు మంచాలున్నాయి. ఒకమూల డ్రాయరూ, దానిమీద కొన్ని పుస్తకాలూ, కొన్ని కాగితాలకట్టలూ, ఒక టైపురైటరూ, దండెంమీద బట్టలూ ఉన్నాయి. ముసలివాడు, "మీరు కూర్చోండి. నేను వెళ్ళి చెబుతాను" అని వెళ్ళిపోయాడు.

సరళ గబగబా దండెం దగ్గరకు వెళ్ళి చూచింది. సాదాచీరె, జాకెట్టు వున్నాయి. "ఇవేనా అతని భార్య కట్టుకునేవి?" అని మూతివిరిచింది. ఆక్షణం ఆమెకు కొంచెం సంతోషం కలిగింది. "ఈ గుడిసెలో ఎందుకున్నాడు? ఇక్కడ ఏ అమృతం కలశాలున్నాయి? అని ఆలోచించింది.

బయట అడుగులధ్వని వినిపించింది. సరళకు భయం వేసింది. మెదలకుండా తలవంచుకొని, మనస్సు చిక్కబట్టుకొని కూర్చుంది. ఆరాటం ఎక్కువయింది.

తలుపు తీసుకొని ప్రసాద్ ప్రవేశించాడు. ఆమెను చూచి "ఓ— మీరా—" అని ఒక్క క్షణం ఆగిపోయాడు. అతని నోటినుంచి వచ్చిన 'మీరా' అనేమాట ఆమె హృదయాన్ని దూసుకుపోయింది. ప్రసాద్ నెమ్మదిగా వెళ్ళి డ్రాయరు దగ్గర కూర్చున్నాడు.

ఆమె తలెత్తి చూచింది. చూపులు తిప్పుకోలేకపోయింది

"ఎంత మారిపోయాడు! ఎంతలో ఎంత చిక్కిపోయాడు!" సరళకు జాలివేసింది బుజ్జగించి, లాలించి, తలనిమురుతూ ముద్దు పెట్టుకుందాం అనిపించిదామెకు.

ఇంతలో ఒక స్త్రీ తలుపు తీసుకొని ప్రవేశించింది. కత్తెరగిజాలూ, బూట్సులూ, కళ్ళకుజోడూ, చంకలో ఫైల్సూ—ఈమేనా ఆయనభార్య!

నమ్మలేక సరళ ప్రసాద్ వంకచూచింది. అతడు గ్రహించి, ఆమెకు ఎదురుగా వెళ్ళి సరళకు పరిచయం చేశాడు.

"ఈమె....ఈమె....నాభార్య హేమ"

సరళకు అయోమయం అయిపోయింది. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కాని, ఆమెకు కోపంరాలేదు. ఏడ్పూ రాలేదు; నవ్వూ రాలేదు. "ఈమె—ఈమె—" అని ఏమిటో గొణిగింది. అలాగే ఆమెను చూస్తూ వుండిపోయింది. ప్రసాద్ అందుకున్నాడు...."ఈమె...." అని సరళను చూపి హేమకు పరిచయం చెయ్యటానికి ప్రయత్నించాడు. ఏం చెప్పాలో తోచక కొంచెంసేపు నసిక్కి, చివ్వరికి "భార్య సరళ" అన్నాడు.

ఇలా జరుగుతుందని ముందు తెలిసే సరళ ఆత్మహత్య చేసుకొనేది ఆమెలో హిందూపాతివ్రత్య లక్షణాలు మెండుగా వున్నాయి. కాని, ఇప్పుడేమీ బాధ వెయ్యలేదు. ఎందుకు బాధ వెయ్యలేదో ఆమెకు అర్థంకాలేదు. మరో స్త్రీని తీసుకొచ్చి, "నా భార్య" అని తన ముందే ప్రసాదు చెపితే తానెలా సహించిందో తనకే అర్థం కాలేదు. అలాగే ఇద్దర్నీ చూస్తూ ఊరుకుంది.

హేమలో ఏమీ మార్పులేదు. ఒక స్నేహితురాల్ని పలకరించినట్టే పలకరించింది. "కూర్చోండి. చాలా అలసిపోయినట్లున్నారు. టీ తెస్తాను" అని లోపలికిపోయి టీ తెచ్చియిచ్చింది.

సరళ తలెత్తకుండా టీ త్రాగుతూవుంది. ప్రసాద్ తలెత్తకుండా ఏదో గీకుతూ వున్నాడు, హేమ వాళ్ళిద్దర్నీ పసిపిల్లల్ని చూచినట్లు చూస్తూ నిలబడివుంది. ఆ చూపుల్తో సరళ కుంగిపోయింది. తప్పుచేసిన పసిపిల్లలాగా అయిపోయింది. ఇక్కడకు రావటమే తప్పనుకుంది. ప్రసాద్‌ని ప్రేమించటమే తప్పనుకుంది. అసలు తానీ ప్రపంచంలో పుట్టటమే ఒక పెద్ద తప్పనుకుంది.

"స్నానం చేస్తారా?" అని హేమ, చోటుచూపుతూ జాలిగా అడిగింది. సరళ ఆ చోటుచూచింది. రెండు తడికెలు అడ్డం పెట్టారు. శరీరం గగుర్పొడిచింది. ప్రసాదుని చూచింది. అతడేదో గీకుతూనే వున్నాడు.

"నేను చెయ్యను" అని నెమ్మదిగా చెప్పింది.

"నేను చేసివస్తాను. క్షణంలో చేసివస్తాను" అని చెప్పి వెళ్ళింది హేమ. నిజంగానే క్షణంలోచేసి ముగించి వచ్చింది. ఈసారి సరాసరి ప్రసాద్ దగ్గరకు వెళ్ళింది.

"నీ వుపన్యాసం ఏది? టైపుచేసి పంపించాలి" అని అడిగింది.

"డ్రాయర్లో వుంది" ముక్తసరిగా చెప్పాడు.

ఆమె డ్రాయరుతీసి, ఒక కాగితాల కట్టతీసి టైపుచేయటం మొదలు పెట్టింది. ప్రసాదు గీకుతూనే వున్నాడు.

సరళ తనకు అర్థంకాని అయోమయ ప్రపంచంలో పడిపోయి ఉక్కిరి బిక్కిరి అయిపోతూ వుంది. అక్కడ వుండలేదు. అక్కడనుంచి ఎలా వెళ్ళిపోవాలో తెలియటంలేదు.

టైపు మోత ఆగిపోయింది. హేమ ప్రసాదుని ప్రశ్నించింది "ఇవ్వాళ సోషలిజాన్ని గురించి వుపన్యసిస్తువనుకున్నాను."

అతడు గీకుతూనే చెప్పాడు. "ఫాసిజం మన దేశాన్ని ఆవరించింది ఇటు జపాను-అస్సాందాకా వచ్చింది. అటు జర్మనీ-టర్కీ దాకావచ్చింది. ఇప్పుడు ఫాసిజానికి వ్యతిరేకంగా బలాన్ని పోగుచేయ్యాలి"

"వ్యతిరేకంగా పోరాటానికికూడా వొక ఆదర్శం వుండాలి, అది సోషలిజం అవ్వాలి." అని కళ్ళజోడు సవరించుకుంటూ అంది హేమ.

"అవును. అది కార్మికుల ఆదర్శం. అది వారికి ఉత్సాహాన్నిస్తుంది కాని, ఫాసిజానికి వ్యతిరేకంగా ఒక్క కార్మికులేకాదు. ఇప్పుడు మనదేశం

వున్న పరిస్థితుల్లో మరికొన్ని వర్గాలుకూడా పోరాడుతాయి. ఇప్పుడు ఇంగ్లండు తన దేశాన్నుంచి మన దేశానికి సైన్యాన్ని పంపే స్థితిలో లేదు. ఇక మన దేశాన్ని రక్షించుకోవలంటే, మనదేశంలోనే సైన్యాన్ని తయారుచేయ్యాలి.మనదేశంలోనే పరిశ్రమలు నెలకొల్పి వృద్ధిచేసుకోవాలి. ఈ విధంగా పరిశ్రమల్ని నెలకొల్పటం కొంతమంది కాపిటలిస్టులకులాభం కనుక వారుకూడా ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధపడతారు. అలాంటివాళ్ళ మనం ఈ పరిస్థితుల్లో బెదరగొట్టగూడదు. మనం అందరం కలిస్తేగాని ఫాసిజాన్ని అరికట్టలేం. ఎవ్వర్ని ఎంతవరకు వాడుకోవాలో అంతవరకు వాడుకోవటం విప్లవకారుల ప్రథమ కర్తవ్యం." అని జవాబు చెప్పాడు.

ఆమె తలూపి మళ్ళీ పైపు ప్రారంభించింది. ప్రసాదు తల వొంచుకొని మళ్ళీ గీకటం ప్రారంభించాడు.

అప్పటికి సరళకు కొంచెం ధైర్యం వచ్చింది. వాళ్ళిద్దర్నీ చూస్తూ కూర్చుంది. అప్పుడప్పుడే ఆమెకేవో కొత్త విషయం అర్థమవుతున్నట్లు కనిపించింది.

* * * *

చీకటి పడింతర్వాత హోటల్‌నుంచి టిఫెన్‌కారియర్‌తో భోజనం వచ్చింది. ముగ్గురూ కూర్చుని తిన్నారు. భోజనం అయింతరువాత హేమ మరో మంచం తెచ్చి, ప్రసాదు మంచానికి, తన మంచానికీ మధ్యవేసి సరళను పండుకోమని కోరింది. సరళకు సిగ్గేసింది. అలిగి మారాం చెయ్యాలని పించింది. చివ్వరికి అంగీకరించింది. ముగ్గురూ పడుకున్నారు. ప్రసాదూ హేమ ఏవేవో రాజకీయాలను గురించి ముచ్చటించుకుంటూనే వున్నారు. సరళకు మాత్రం రెండు అగ్ని పర్వతాలమధ్య పడుకున్నట్లుంది. తపన పుట్టింది. వాళ్ళేదో "ఇంపీరియలిజం" "ఫేసిజం" అనుకుంటున్నారు. ఆమెకేమీ అర్థంకావటం లేదు. కాని వాళ్ళతోపాటు ఆమెకూడా నిద్రపోకుండా మేల్కొంది.

తెల్లవారి లేచి వాళ్ళు మరో ఉపన్యాసానికి తయారు. హేమ వచ్చి అడిగింది. "మీరుకూడా రండి"

"వస్తా" అంది సరళ. నిజం చెప్పాలంటే. హేమ ఏమడిగిందో, తానేమీ చెప్పిందో తనకే తెలియదు. అది సరే అంది, బయలుదేరింది.

ఆ మీటింగులో ప్రసాద్ కోసం అనేకమంది కార్మికులు నిరీక్షిస్తున్నారు. వాళ్లంతా ప్రసాద్ కనిపించగానే జయజయ ధ్వానాలూ, కరతాళ ధ్వనులూ చేసి పుష్పమాలలతో నింపేశారు. ఆ కార్మిక జనాన్ని, వారి ఉత్సాహాన్నీ, ఉద్రేకాన్నీ చూస్తే సరళకూడా ఆత్మవిశ్వాసం కలిగింది. కదలకుండా మెదలకుండా కూర్చుని ప్రసాద్ ఉపన్యాసం సాంతంగా వింది. కాని, అతని కళ్ళు తళతళలాడినప్పుడల్లా ఆమె గుండె దడదడలాడేది. ఆ కార్మికజనం అతని వాక్యవాక్యానికీ, మాటమాటకీ ఉప్పొంగిపోవటంచూస్తే ఆమెకూడా ఆనందం కలిగింది. వాళ్ళ కళ్ళల్లోని కాంతినీ, ఉత్సాహాన్నీ, ఉద్రేకాన్ని చూచి ఉప్పొంగిపోయింది. వీళ్ళేనా అప్పుడు నాకు బందిపోటు దొంగల్లాగ కనిపించింది!" అని నొచ్చుకుంది.

అప్పుడామెకు అర్థమయింది, ఆమె ప్రసాద్ మనస్సుని ఎంత కష్ట పెట్టిందీ అప్పుడు తెలుసుకుంది. అతడు తన్ను విడిచిపెట్టి హేమను ఎందుకు వివాహం చేసుకున్నాడో అప్పుడు గ్రహించి ఒక్క నిట్టూర్పు విడిచింది. ఆమె కోర్కెలూ, ఆశలూ కెరటాల్లాగా ఎగిరిపోయినై. కాని వాటిస్థానే—

*    *    *    *

మీటింగు అయిపోయింది. ముగ్గురూ యింటికి తిరిగివచ్చారు. మళ్ళీ హేమ సైపుచెయ్యటం మొదలుపెట్టింది. ప్రసాద్ ఏదో గీకటం మొదలు పెట్టాడు. కాని, సరళ మాత్రం వాళ్ళిద్దర్నీ చూస్తూ కూర్చోలేదు. హేమ దగ్గరకు వెళ్ళింది. ఆమె ఏమి సైపు చేస్తోందో చూచింది. హేమ సరళను ఆనందంగా చూచింది. చిరునవ్వు నవ్వింది. సరళ మాతృదేవిలాగు ఆనందించింది. ఆమె ముంగురులు సర్దింది. ఇదంతా చూచి ప్రసాద్ మరింత

మరింత తొందరగా, బలంగా గీకటం మెదలెట్టాడు. సరళ నెమ్మదిగా ప్రసాదు దగ్గరకు వచ్చింది. ప్రసాదు మరింత వేగంగా గీకుతున్నాడు.

"నేను వెళ్తున్నాను" అని చెప్పింది. ప్రసాద్ గీకటం హఠాత్తుగా ఆగిపోయింది; ఆ . ను అర్థం చేసుకుంటానికి పరిశీలనా దృష్టితో చూశాడు. సరళ తలవంచుకుంది.

పైపుమోత ఆగిపోయింది. "పోనీ ఇక్కడే వుండిపోగూడదూ...." అంది హేమ.

"వీల్లేదు. నేను వెళ్ళాలి" అని దృఢసంకల్పంతో చెప్పింది సరళ.

"స్టేషన్ మైలుదూరం వుంది, బండి పిలుస్తాను" అన్నాడు ప్రసాద్.

"అక్కర్లేదు, నడుస్తాను" అన్నది సరళ.

హేమ టైప్ రైటర్ని వదలి లేచి వచ్చింది. సరళ ఆమెను ప్రేమపూర్వకంగా కౌగలించుకొని, సెలవు తీసుకొని బయలుదేరింది. ప్రసాద్ ఆమెను అనుసరించాడు.

ఇద్దరూ రైల్వేస్టేషన్‌వైపు నడుస్తున్నారు. ఎవ్వరూ పెదవి కదల్చటంలేదు. అలాగే నడిచిపోతున్నారు.

వారు వెళ్తుంటే దారిలోవున్న కార్మికజనమంతా లేచి నిలబడి, నమస్కరిస్తున్నారు. ఎదురుగా వచ్చేవారంతా భక్తితో తొలగిపోతున్నారు. 'బాబు, బాబు' అని గుసగుసలాడుతున్నారు. "ఆ అమ్మాయి స్నేహితురాలు. ఆ పనిలో అమ్మాయే" అని చెప్పుకుంటున్నారు.

వారుమాత్రం అలాగే వెళ్ళిపోతున్నారు. కొంత దూరం వెళ్ళిన తరువాత ప్రసాద్ హఠాత్తుగా ఆగి—

"సరళా...." అన్నాడు.

ఆమె ఆగిపోయి వొణికిపోతూ ఆశగా, బాధగా, ఆశ్చర్యంగా అతని కన్నుల్లోకి చూచింది. అతడు చెప్పాడు: "నీతో వొక్కమాట చెప్పాలి.

నిన్ను నిష్కారణంగా బాధించానని నేను చాలా బాధపడ్డాను. మనస్సు కుదుట పర్చుకోటానికీ, సమన్వయం చేసుకోటానికీ ప్రయత్నించాను. కాని లాభంలేక పోయింది. నీవు గృహలక్ష్మివి. నాకు గృహంలేదు. ఇకలక్ష్మినేం చేసుకోను——"

ఆమె ఒక్క నిట్టూర్పు విడిచి, ఏమీ మాట్లాడకుండా ముందుకు సాగింది. అతడు అనుసరించాడు. అలాగే స్టేషన్‌దాకా నడిచిపోయారు. ఆమె అక్కడ ఆగి, ఒక్కసారి ప్రసాదుని తనివితీరా చూచి ఇలాచెప్పింది "నాకర్థమయింది. మీ ప్రపంచం అర్థమయింది. నా పూర్వ ప్రపంచం కూడా ఇప్పుడే అర్థమౌతోంది. ఇందులో మీరు విచారించవలసిందేమీలేదు. కాని.... కాని...." ఆమె కంటినుంచి రెండు కన్నీటిబొట్లు రాలినై. "నా జీవితం వ్యర్థం. నా ప్రపంచం ముధనష్టం. శవాలుతప్ప మరేవీ అక్కడ బతకలేవు నే నిప్పుడు తెలుసు కున్నాను. ఆ ప్రపంచంలోకి, ఆ బద్ధకంలోకి, ఆ శవాల్లోకి మిమ్మల్ని రమ్మనను. ఇన్నాళ్ళు మిమ్మల్ని ఆపీ, దింపి,పూజించి వేధించినందుకు క్షమించండి" ప్రసాద్ నిశ్చేష్టుడై వింటున్నాడు-సరళ గొంతుసవరించుకుని కష్టంగా మళ్ళీ అందుకుంది. "కాని మిమ్మల్ని ఒక్క కోరిక కోరాలనివుంది. నేను మీ పనికి అడ్డంరాను. అందుకనే హేమ వుండమంటే వుండనని అంత గట్టిగా చెప్పాను. నాలో ఒక్కటే కోరిక వుంది, అది తీరితే నాజన్మ తరించినట్లే!"

"ఏమిటి సరళా?" ఆదుర్దాగా, అనుమానంగా అడిగేడు.

ఆమె తలవంచుకుని కాలి బొటనవేలు కిందరాస్తూ, గాద్గదికంగా అడిగింది "మీ కెప్పుడైనా....ఏదైనా....సహాయం కావలిస్తే-ఇతరుల నుంచి తీసుకునే బదులు, నానుంచే తీసుకోండి——" ఇక ఆపుకోలేక పోయింది. అతని రొమ్ము మీద తల ఆన్చి ఏడ్చింది.

అతను ఉలిక్కిపడ్డాడు. సరళ యీ విధంగా యింత సహనంతో ఇంత బాధతో మాట్లాడుతు దని అనుకోలేదు. తానూ రెండు కన్నీటిబొట్లు రాల్చాడు.